‘పల్లెవెలుగు’ వచ్చేదెప్పుడో?

- ఆశగా ఎదురుచూస్తున్న పల్లెవాసులు
- పునః ప్రారంభించని అధికారులు
- ప్రయాణించాలంటే ఆటోలే దిక్కు
- వినతి పత్రాలు ఇచ్చినా స్పందించని ఆర్టీసీ అధికారులు



కమాన్‌పూర్: గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వం రూ.కోట్లల్లో నిధులు వెచ్చించి తారురోడ్లు నిర్మించినా ఆ గ్రామాలకు పల్లెవెలుగు(ఆర్టీసీ) బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు పల్లెలకు బస్సులు రాకపోవడంతో ప్రత్యామ్నయంగా ఆటో లేదా ఇతర ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫలితంగా జేబులకు చిల్లు పడుతోందని ఎక్కువగా జనాలను పోగుచేసి ఆటోల్లో తరలిస్తుండడంతో ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో పల్లెలకు వచ్చిన ఆర్టీసీ బస్సులు అనివార్య కారణాలతో రద్దవడంతో నేటి వరకు పునప్రారంభించలేదు. ఆయాగ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు బస్సులు పునఃప్రారంభించాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ప్రారంభించడం లేదు. దీంతో పల్లెవాసులు ఆర్టీసీ బస్సులకు దూరమై ఆటోలు, ప్రైవేటు వాహనాలకు చేరువయ్యారు. ఈ నేపథ్యంలో రెండురోజుల క్రితం పల్లెల్లో ఆర్టీసీ సేవలు పునరుద్దరించేందుకు ఆర్టీసీ ప్రతినిధులు పల్లెబాట పట్టి రూట్ సర్వేచేయనున్నట్లు సమాచారం. వీరి రాకతోనైనా పల్లెలకు ఆర్టీసీసేవలు అందుతాయని గ్రామీణ ప్రజలు వేచిచూస్తున్నారు. కమాన్‌పూర్ మండలంలోని నాగారం, లింగాల, రొంపికుంట, పాలకుర్తి మండలంలోని గుంటూరుపల్లె, ఎల్కలపల్లి, రాణాపూర్ గ్రామాలకు పల్లెవెలుగు(ఆర్టీసీబస్సు) సౌకర్యంలేక ప్రజలు నానా ఇబ్బందు పడుతున్నారు. సమయానికి ఆటోలు లేకపోతే 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

బస్సులను రద్దుచేసిన ఆర్టీసీ

గతంలో గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి గోదావరిఖని మార్కండేయ కాలనీ, గౌతమీనగర్, ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్, గుంటూరుపల్లె, ఎల్కలపల్లి గ్రామం, నాగారం, లింగాల, రొంపికుంట, పేరపల్లి గ్రామాల మీదుగా పెద్దపల్లి వరకు, పాలకుర్తి మండలం రాణాపూర్, కన్నాల గ్రామాల మీదుగా పెద్దపల్లి వరకు ఆర్టీసీ బస్సులు నడిపించారు. అనివార్య కారణాలతో రెండు రూట్లలో బస్సులు రద్దుచేశారు. నేటివరకు మళ్లీ బస్సులను ప్రారంభించలేదు.

ఆటోలే దిక్కు..

ఈ ప్రాంత గ్రామీణ ప్రజలు, రైతులు ఎక్కువగా కూరగాయలు, పాలవ్యాపారం చేస్తుంటారు. పండించిన కూరగాయాలు, పాలను పారిశ్రామిక ప్రాంతాలైనా గోదావరిఖని, ఎన్‌టీపీసీ, ఎఫ్‌సీఐ ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. తమ వ్యాపారాలు కొనసాగించడానికి వెళ్దామంటే ఆర్టీసీ బస్సులు లేక వ్యాపారులు, విద్యార్థులు ఆటోల్లో అధిక చార్జీలు చెల్లించి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

పట్టించుకుంటలేరు



గతంలో గోదావరిఖని నుంచి రొంపికుంటమీదుగా పెద్దపల్లి వరకు నడిపించిన ఆర్టీసీ బస్సులను తిరిగి కొనసాగించాలని పలుమా ర్లు గోదావరిఖని ఆర్టీసీ ఆధికారుల కు వినతిపత్రాలుఅందించినా పట్టించుకుంట లేరు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– కట్కం రవీందర్, సర్పంచ్, రొంపికుంట

పట్టించుకోని ఆర్టీసీ అధికారులు..

గోదావరిఖని నుంచి నాగారం, రొంపికుంట, పెద్దపల్లి వరకు, రాణాపూర్, కన్నాల మీదుగా పెద్దపల్లి వరకు గతంలో నడిపించి రద్దుచేసిన ఆర్టీసీ బస్సులను మళ్లీ కొనసాగించాలని పలుమార్లు గోదావరిఖని ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు అంటున్నారు.

క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా పెద్దపల్లి అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్‌చైర్మన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో సోమవారం రూ.7.20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైయినేజీ పనులను కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలకు మౌళిక వసతులుకల్పించడంపై శ్రద్ధచూపుతున్నామన్నారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని వివరించారు.నాయకులు సాబీర్‌ఖాన్, ఏతఉలు సతీశ్, మనోహర్ తదితరులున్నారు.

బహుమతులు అందజేత



బహుమతులు అందిస్తున్న సర్పంచ్ పద్మ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని పన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో వేసవి సెలవులు ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులు ఆటపాటలతో సందడిచేశారు. అనంతరం విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బందికి సర్పంచ్ అల్లం పద్మ షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రీదేవి, ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్, కార్యదర్శి ఆకాశ్, ఉపాధ్యాయురాలు శోభరాణి, అంగన్‌వాడీటీచర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్‌ఆఫీసర్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: అగ్నిప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకునేందుకు కనీస అవగాహన కలిగిఉండాలని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాద నివారణకు అవసరమైన పరికరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆసుపత్రులు, పాఠశాలల్లో అగ్నిప్రమాద నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా పరికరాల వినియోగంతో అగ్నిప్రమాదాలను నియంత్రించే పద్ధతులపై అవగాహన కల్పించారు. సిబ్బంది మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, ప్రవీణ్‌కుమార్,శ్రీనివాస్ ఉన్నారు.


అవయవ, శరీర దానానికి అంగీకారం



అభినందన పత్రం ఇస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: తన మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేస్తానని గోదావరిఖని, అడ్డగుంటపల్లికి చెందిన శ్రావణ్‌కుమార్ తన అంగీకార పత్రాన్ని సదాశయ ఫౌండేషన్‌కు అందించారు. సింగరేణి సంస్థ ఓసీపీ–3 ప్రాజెక్ట్ లో ప్రైవేట్‌ఆపరేటర్‌గా పనిచేస్తున్న శ్రావణ్ కుమార్ తన పెళ్లిరోజు సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందనపత్రం అందించారు. సదాశయ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి లింగమూర్తి, సలహాదారు నూక రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజమౌళి సదాశయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, కే.ఎస్.వాసు, రాజేందర్ అభినందించారు. రాజా మహేందర్ రెడ్డి, ఆరెపల్లి రాజమౌళి, బంధుమిత్రులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఈటల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ నాయకులు సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు దిష్టిబొమ్మను ఊరేగించారు. అనంతరం మాట్లాడుతూ.. తమ నాయకుని జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జక్కుల నరహరి, మామిడి రాజేశ్, కర్రావుల డేవిడ్‌రాజు, మిట్టపల్లి సతీశ్‌కుమార్,గాండ్ల స్వరూప, ఈదునూరి చిరంజీవి పాల్గొన్నారు.

గౌరెడ్డిపేట గ్రామసభ రసాభాస



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసాగా మారింది. గ్రామసభలో ఎంపీపీ స్రవంతి భర్త శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ మధ్యనున్న విభేధాలతో గ్రామసభలో వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రతి పంచాయతీకి ప్రభుత్వం కేటాయించిన రూ.10లక్షల నిధులను తానుచేస్తున్న విద్యుత్‌స్తంభాల ఏర్పాటుకు నిధులివ్వాలని ఎంపీపీ భర్త కోరారు. అయితే తాను ఇదివరకే ఆ నిధులతో గ్రామంలో సీసీరోడ్లకు అనుమతి పొందానని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీపీ భర్త శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన వర్గీయులు, సర్పంచ్‌కు మద్దతుగా ఆయన వర్గీయులు వాదనలకు దిగడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. కార్యదర్శి ప్రకాశ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు అంబేడ్కర్ సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న జ్యోషిక, కౌశిక్

సుల్తానాబాద్: కరోనా విపత్కర సమయంలో చేసిన సేవా కార్యక్రమాలకు సుల్తానాబాద్ పట్టణానికి చెందిన చిన్నారులు ఏగోలపు జ్యోషిక, ఏగోలపు కౌశిక్‌లకు 2023 అంబేడ్కర్ సేవా పురస్కారం అవార్డు అందుకున్నారు. జై భీమ్ విద్యాఫౌండేషన్ అధ్యక్షుడు జన్ను రాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో డాక్టర్ ప్రతిభాలక్ష్మీ, ఎస్.వేణుగోపాల్‌చారి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ చేతులమీదుగా అందించారు. తాము చేసిన సేవలను గుర్తించి అవార్డు అందించినందుకు చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు.

దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న పూజారులు

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామంలోని శివానంద ఆశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తాళ్ల లింగయ్య, గోనే నర్సయ్య ఆధ్వర్యంలో వైభవంగా కాశీనాగ సాధువులు సోమవారం దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈఆశ్రమంలో శివాలయం దుర్గామాత, అంజనేయ ఆలయాలున్నప్పటికీ దత్తాత్రేయ విగ్రహం ప్రతిష్ఠించడంతో ఈ ఆశ్రమం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతుందని నాగసాదువులు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లమల్లేశం, ఎంపీటీసీ సభ్యురాలు తాళ్లపెల్లి భద్రమ్మ, ఉపసర్పంచు బానోత్ రాజేశ్వరి భక్తులు పాల్గొన్నారు.

శివాలయానికి ఫ్యాన్ల వితరణ

సుల్తానాబాద్: హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ భక్తబృందం సుల్తానాబాద్ పట్టణంలోని శివాలయానికి భక్తుల సౌకర్యార్థం రెండుఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో పూజారి రమేశ్‌శర్మ, శివాలయం, హనుమాన్ భక్తబృందం పాల్గొన్నారు.

ఆలయంలో ప్రాభోధకి

ఎలిగేడు: మండలలలోని శ్రీవేంకటేశ్వరాలయంలో తిరుక్కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం ప్రాభోధకి, ఉదయం సాయంత్రం ప్రబంధసేవాకాలం వంటి ప్రత్యేక పూజకార్యక్రమాలను ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు , భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మే 10 నుంచి రాగినేడు శివాలయ పునఃప్రతిష్ఠ

పెద్దపల్లిరూరల్: మండలంలోని రాగినేడు గ్రామంలో అతిపురాతన శివాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలను మే 10,11,12 తేదీల్లో జరపాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పోలీస్‌హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. తన సొంత గ్రామమైన రాగినేడులో నిర్మించిన ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి గ్రామపెద్దలతో చర్చించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. గ్రామస్తులు నాయకులు, ప్రజాప్రతినిధులు వెంట ఉన్నారు.

‘కార్యదర్శుల’ పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుకార్డులతో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలపరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నిరసన చేపట్టారు. తమ ఉద్యోగాలను క్రమబద్దీకరించాలంటూ సోమవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈనెల 12 నాటికే ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయిందని, ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్, ప్రకాశ్, స్వప్న, రాధ, మంగ తదితరులు డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

కమాన్‌పూర్: రామగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్‌కు పంపించే పోస్టుకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారి సమస్యలు పరిష్కరించాలని పోస్టుకార్డులను పోస్టుచేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించే వరకు ఉద్యమిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఆకాశ్, కరీమా పురుషోత్తం, శ్రీనివాస్, పెండి రమ్య, అమల, హరి, శ్యామ్‌ప్రసాద్, రమ, వనిత, సంతోష్ ఉన్నారు.

స్టోన్ క్రషర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ రాజుల గుట్ట వద్దనున్న శ్రీవెంకటేశ్వర స్టోన్‌క్రషర్‌పై రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. క్రషర్‌లో భారీగా పేలుళ్లు వస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయని, దగ్గరున్న ఇళ్లగోడలు బీటలు వారుతున్నాయని, వరి, మొక్కజొన్న, మామిడి తోటలకు తీరని నష్టం వాటిల్లుతోందని ఫిర్యాదుచేశారు. ఈ విషయమై సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో పెద్దులు, రాజేశం, రాంరెడ్డి, రమేశ్, సంతోశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

నేటి సమావేశాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ శైలజ

మంథని: పట్టణంలో మంగళవారం నిర్వహించే బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్టశైలజ కార్యకర్తలను కోరారు. సోమవారం తన నివాసంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులతో సమావేశమయ్యారు. మంగళవారం నాటి సమావేశానికి పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను తమ వార్డుల్లో వివరించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, తదితరులు ఉన్నారు.

‘డీసీహెచ్‌ఎస్‌ను సస్పెండ్ చేయాలి’

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో నిర్మిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఉద్యోగాల నియామకంలో అక్రమాలకు పాల్పడిన డీసీహెచ్‌ఎస్‌ను సస్పెండ్ చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి మధు డిమాండ్ చేశారు. తమ పార్టీ నాయకుడు సతీశ్ చేసిన ఫిర్యాదుతో ఉద్యోగనియామకాలను రద్దుచేశారని పేర్కొన్నారు. అందుకు కారకుడైన అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కొండి సతీశ్, శ్రీనివాస్, సదానందం, రాజ్‌కుమార్, రవి, పర్శరాం రాజ్‌గోపాల్, వేణు ఉన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

రామగుండం: మానవ సంబంధాల విలువను చాటిచెప్పేలా తీసిన బలగం సినిమా గ్రామీణులను ఆకట్టుకుంటోంది. గోలివాడలో ఈ సినిమాను ప్రదర్శించగా.. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్–ప్రసన్నతాకూర్ దంపతులు వీక్షించారు.

కంటివెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి

గోదావరిఖనిటౌన్: 27వ డివిజన్‌లోని గాంధీపార్క్ పాఠశాలలో ‘కంటివెలుగు’ వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ కల్వల శిరీష ప్రారంభించారు. వైద్యశిబిరాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వికలాంగులకు త్రీవీలర్ బైక్ అందజేత



వికలాంగులకు స్కూటీలు అందిస్తున్న ఎన్నారై

సుల్తానాబాద్: బల్మూరి రామ్‌సుమన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్నారై, విజయ జ్ఞాపకార్థం సుల్తానాబాద్ పట్టణానికి చెందిన వికలాంగుడు దేశ్‌ముఖ్ విజయ్‌కుమార్ కాట్నపల్లికి చెందిన వికలాంగుడు కోడూరి అనిల్‌కుమార్‌కు సోమవారం సుల్తానాబాద్ పట్టణంలో తెలంగాణ జాగృతి ఎన్నారై అధ్యక్షుడు బల్మూరి సుమన్‌రావు చేతుమీదుగా త్రీవీలర్ బైక్‌లను అందించారు. ఈ సందర్భంగా వికలాంగులు అనిల్, విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. బల్మూరి వెంకటేశ్వర్‌రావు, జూపల్లి మాదశరావు, జిత్తూ సింగ్, జూపాక కుమారస్వామి, తుమ్మ రాజ్‌కుమార్, కోడూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న చిలుక శంకర్

జ్యోతినగర్: ట్రాక్టర్ డ్రైవర్లకు యజమానులు కనీస వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ ట్రాక్టర్‌డ్రైవర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు చిలుక శంకర్ కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్ యూనియన్ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు కే.రాజన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్‌తో కలిసి శంకర్ మాట్లాడుతూ.. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల వేతనాలు, చట్టబద్ధ హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ప్రస్తుతం పొందుతున్న వేతనాలతో కుటుంబాలను పోషించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ల వేతనాలు పెంచాలని గత మార్చిలో సమ్మెనోటీస్ అందించినప్పటికీ యజమానులు స్పందించలేదన్నారు. యాజమానులు, యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపేందుకు ముందుకు రావాలని కోరారు. లేనిపక్షంలో మేరెండో తేదీ నుంచి సమ్మెచేస్తామని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు కొమురయ్య, ప్రధానకార్యదర్శి మురళి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాస్‌లు పంపిణీ



ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

జ్యోతినగర్: బీఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ సహకారంతో ప్లేట్స్, గ్లాసులు పంపిణీ చేశారు. సోమవారం రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ హాజరై విద్యార్థులకు ప్లేట్స్, గ్లాసులు పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ ద్వారా విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పెగడపల్లి కిషోర్, ఈదునూరి రాజేశ్వర్, చిలుముల మల్లేశ్, చల్లూరి కొండయ్య,హెచ్‌ఎం షహనా తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న విద్యుత్‌శాఖ అధికారి రాజ్‌కుమార్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ పి.కె.రామయ్యకాలనీకి చెందిన పాలవేణి స్వప్న కుటుంబానికి సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు రూ.5లక్షల చెక్కును అందించారు. 2022 జూన్‌లో స్వప్న విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది. ఈ నేపథ్యంలో టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ బీమా పథకంలో భాగంగా రూ.5లక్షల కోసం సేవాస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపల్లి మల్లేశ్ విద్యుత్ అధికారులకు దరఖాస్తు చేయగా ఈ మేరకు మంజూరైన చెక్కును రామగుండం డివిజనల్ ఇంజినీర్ రాజుకుమార్ చేతులమీదుగా మృతురాలి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా మడిపల్లి మల్లేష్‌తో పాటు సహకరించిన విద్యుత్‌శాఖ అధికారులకు స్వప్న కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేదకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న జడ్పీటీసీ లక్ష్మణ్

ఓదెల: ఈదురుగాలుల వర్షానికి ఇంటిపైకప్పు లేచిపోయి రోడ్డుపాలైన కుటుంబానికి జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. ఓదెల మండలంలోని పిట్టలపల్లె గ్రామంలో ఇటీవల ఈదురుగాలుల వర్షానికి ఆనవేన రాజయ్య నివసిస్తున్న ఇంటిపైకప్పు లేచిపోయింది. విషయం తెలుసుకున్న కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ బాధితుడికి రూ10వేల ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల సరిత, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు వేల్పుల చంద్రశేఖర్, నాయకులు దండె వెంకటేశ్వర్, సాయి,శ్రీకాంత్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యత

జూలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ అన్నారు. మండలంలోని వడ్కాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో మనఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా, వసతుల కల్పనకు, వంటగది నిర్మాణానికి రూ. 42 లక్షలతో చేపడుతున్న పనులకు ఎంపీపీ రమాదేవి, వైస్‌ఎంపీపీ రమేశ్‌తో కలిసి భూమిపూజ చేశారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ స్వామి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, నాయకులు అంతయ్య, శ్రీనివాస్, సతీశ్, గుమ్మడి స్వామి, జెట్టి సతీశ్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

మంథని/సుల్తానాబాద్‌రూరల్/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/రామగుండం/ఓదెల/ధర్మారం/యైటింక్లయిన్‌కాలనీ: రైతులకు గిట్టుబాటు ధరతో పాటు సాగుకు పెట్టుబడి సాయం అందిస్తూ సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని జెడ్పీచైర్మన్ పుట్టమధు అన్నారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మంథని మండలం కన్నాల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో సోమవారం మండలకేంద్రాలతో పాటు, గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కేంద్రాలకు ధాన్యం తెచ్చేముందు తేమశాతం లేకుండా చూసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న నల్ల మనోహర్‌రెడ్డి

జూలపల్లి/ఓదెల: జూలపల్లి మండలంలోని చీమలపేటలో, ఓదెల మండలంలోని గోపరపల్లెలో అకాల వర్షానికి నష్టపోయిన వరి, మొక్కజొన్న, మామిడి పంటలను పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు, తడిసిన ధాన్యాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకు డు నల్ల మనోహర్‌రెడ్డి రైతులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అ కాల వర్షాలతో రైతుల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పంటనష్టం అంచనావేసి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో రైతులు తొంటి మధు, తీగెల కనుకయ్య, రాయుడు, బీరయ్య, శేఖర బుచ్చయ్య, కాశేవేని నరేశ్, దొడ్డె శంకర్, మేకల రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.